క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీలపై చంద్రబాబుది కపట ప్రేమ

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన

నెల్లిమర్ల రూరల్: ఎస్సీ, ఎస్టీలపై మాజీ ముఖ్య మంత్రి కపట ప్రేమ కనబరుస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలో సీతారామునిపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ...గతంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలన్నింటినీ చెత్త బుట్టలో వేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మళ్లీ ఇప్పుడు కపట ప్రేమ కనబరుస్తున్నాడని ఆరోపించారు. ఆయన ప్రకటించిన మేనిఫెస్టో అంతా బూటకమన్నారు. చంద్రబాబు హామీలను ప్రజలను నమ్మే పరిస్థితి లేదన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విజయనగరం: పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి వెంకట వరప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అని తెలిపారు. వైద్యులు ఎం. ప్రవీణ్ కుమార్, ఎ. వివేక్ సుమారు 200 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ పెంటపాటి ముత్యాలు, దేవాలయం కమిటీ చైర్మన్ విజయ రామయ్య, కన్వీనర్ కామరాజు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



ఆర్‌అండ్‌బీ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సేవా సంఘు ప్రతినిధులు

విజయనగరం టౌన్: శ్రీవాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం కంటోన్మెంట్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ జంక్షన్ బస్టాప్ వద్ద మంగళవారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, వేసవి తాపం ఎక్కువగా ఉన్నందున ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. బయటకు వచ్చేవారు తప్పనిసరిగా టోపీ ధరించాలని, లేనిపక్షంలో గొడుగు వినియోగించాలని సూచించారు. అలాగే నిమ్మరసం, మంచినీరు, పళ్లరసాలు, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిమ్స్ రాజు, కోశాధికారి త్రినాథ్, కొల్లా సాయిరాజు, వడ్డాది ఈశ్వరరావు, ఉప్పల కాశీ, కేవీ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న నర్తనశాల అకాడమీ విద్యార్థినులు

విజయనగరం టౌన్: నగరంలోని మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో ప్రతివారం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా నర్తనశాల డ్యాన్స్ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణి శిష్యబృందం మంగళవారం రాత్రి ప్రదర్శించిన భరతనాట్య నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. అదే విధంగా కళా రవి పైడితల్లి అమ్మవారి పాట, ప్రవచనాలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ప్రసాదరావు, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, బంటుపల్లి వెంకటరావు, శ్రీనివాసరాజు, ఆర్.సూర్యపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ డిజైన్‌లను పరిశీలిస్తున్న జేఎన్‌టీయూ జీవీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.గురునాథ్

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఎంబెడ్డెడ్ సిస్టమ్స్ అండ్ ఐఓటీ'లను అనుసరించి మంగళవారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో రూపొందించిన 20 డిజైన్లను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనలను జేఎన్‌టీయూ జీవీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.గురునాథ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. కొత్త రంగాలలో అభివృద్ధి దిశగా ప్రయత్నాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీఏ నాయుడు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దగాకోరు చంద్రబాబును నమ్మొద్దు..

- అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన వైఎస్సార్‌సీపీని గెలిపించండి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశానికి హాజరైన గాజులరేగ ప్రజలు, (ఇన్‌సెట్లో) 48వ డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అభివృద్ధి చేసాం ఆశీర్వదించండి.. సంక్షేమం అందించాం మరోసారి ఆదరించండని వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి ఓటర్లను అభ్యర్థించారు. నగరంలోని 48, 49 డివిజన్‌లలో మంగళవారం ఉదయం.. 19, 20, 21, 50 డివిజన్‌లలో సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి చేశాం కాబట్టే ప్రజలను ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయనగరం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని చెప్పారు. గతంలో ఐదు రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తే.. ప్రస్తుతం రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. గాజులరేగ పరిధిలో పది పడకల ఆస్పత్రిని నిర్మించి ప్రజావినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి జగనన్న విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పరిధి రూ. 5 లక్షల నుంచి 25 లోల రూపాయలకు పెంచారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, నగర అభివృద్ధికి కోలగట్ల అహర్నిశలు శ్రమించారని, అటువంటి వ్యక్తిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, జిల్లా యాదవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మన్యాల కృష్ణ, కనుగుల రాజా, పీఏసీఎస్ అధ్యక్షుడు జమ్ము మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జామాన శ్రీనివాసరావు, పత్తిగిల్లి రమణ, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు అండగా నిలవండి..



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌పై టీడీపీది దుష్ప్రచారం

విజయనగరం: ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై నీచరాజకీయాలు చేస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబుకు చెంపపెట్టుగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మాజీ వలంటీర్లు పింఛన్‌దారులకు అండగా నిలవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. లబ్ధిదారులు బ్యాంకులు, ఏటీఎంల చుట్టూ తిరగకుండా వారికి తగిన సహాయ, సహకారాలు అందించాలన్నారు. మంగళవారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారమే పరమావధిగా ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యవస్థలను నీరుగారుస్తున్నారని ఆరోపించారు. వలంటీర్ వ్యవస్థపై అక్కసు వెళ్లగక్కిన చంద్రబాబు అదే వలంటీర్లకు తాను అధికారంలోకి వస్తే రూ.10 వేల గౌరవవేతనం ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు తప్పుడు పనులు చేస్తూ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. 2014 ఎన్నికలకు ముందు 600 హామీలిచ్చిన చంద్రబాబు తాజాగా 6 గ్యారెంటీలంటూ మరోసారి ప్రజలను మోసగించేందుకు వస్తున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల



అనిలాసునందనిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ అనిలాసునందనిని సహచర వైద్యులు మంగళవార సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనిలాసునందని చిత్తశుద్ధితో విధులు నిర్వహించారన్నారు. అందరితో స్నేహపూర్వకంగా మెలిగేవారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు పీఏ రమణి, అజయ్‌కుమార్, ఆర్ఎంఓ ఎస్.సురేష్‌బాబు, సంబంగి అప్పలనాయుడు, వైద్యులు బి.అజయ్ కుమార్, ప్రసాద్, బి.సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి..

- ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ప్రత్యేక హోదా ఇవ్వని కేంద ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబాటుతనాన్ని పారద్రోలే పాలకులు రావాల్సిన అవసరం ఉందని, అటువంటి వారినే ఓటర్లు ఎన్నుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తోలుబొమ్మలాటను మానుకుని ఉత్తరాంధ్ర, రాయలసీమకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని.. ఈ విషయమై అభ్యర్థులు నిలదీయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ప్రతినిధి పి.బుల్లిరాజు, ఆంధ్రా ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ అప్పలనాయుడు, డాక్టర్ జశ్వంత్ నాయుడు, డాక్టర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం..



సతివాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమని, ఈ విషయం గత 58 నెలల పరిపాలనలో నిరూపితమైందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సతివాడ, గుషిణి, ఆల్తిపాలెం, తంగుడుబిల్లి, దన్నానపేట, గొర్లిపేట, కొత్తపేట, తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలు అందజేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందించాం కాబట్టే ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడును, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించుకుని జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గిరిబాబు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ కోట్ల పైడినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందాం..

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



డెంకాడ: బొడ్డవలసలో ఎన్నికల ప్రచారంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

భోగాపురం: పేదలకు మంచి చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ముక్కాం గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చుట్టపు చూపుగా వచ్చి ఎన్నికలు అవ్వగానే తిరిగి అమెరికా వెళ్లిపోయే నాన్‌లోకల్ మాధవి మనకొద్దని పిలుపునిచ్చారు. నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరించే తనను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తాను ఇప్పటికే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, మరోసారి గెలిపిస్తే జగనన్న సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలను నమ్మవద్దని సూచించారు. ప్రతి పేదవాడికీ జగనన్న ప్రభుత్వంలో లబ్ధి చేకూరిందని.. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాష్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, వాసుపల్లి రేయ్యుడు, బోగిరాజు, దంతులూరి రావాడబాబు, కొండపు కొత్తయ్యరెడ్డి, దాట్ల శ్రీనురాజు, సూరాడ చిన్నారావు, అప్పరభుక్త పైడినాయుడు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని దీవించండి

డెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓటు వేసి దీవించాలని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బొడ్డవలస నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థతో ఇంటిముంగిటకే పాలన తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరారు. అంతకుముందు బొడ్డవలస గ్రామంలో జోన్-2 ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్ము నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్ర శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు.

ఆకులపేట,జొన్నాడల్లో..

మండలంలోని ఆకులపేట, జొన్నాడ గ్రామాల్లో జోన్-2 ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్‌లు కోరాడ రమణి, సువ్వాడ రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ కోటినాయుడు, త్రిపురగిరి మురళి, తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు. బడ్డుకొండ అప్పలనాయుడు, బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరారు.

• పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలతో అలంకరించిన అమ్మవారు



భక్తులకు ఉచితంగా మజ్జిగ అందజేస్తున్న సేవకులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా చదురుగుడి, వనంగుడిలలో పూజలు చేశారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు మజ్జిగ అందజేశారు.

– విజయనగరం టౌన్

• వైఎస్సార్‌సీపీలో చేరికలు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 8వ డివిన్‌కు చెందిన ప్రజలతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌కు చెందిన 65 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో వారంతా ప్రతిపక్ష టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో నూతనంగా చేరిన వారందరికీ కోలగట్ల, డివిజన్ నాయకులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. దక్షిణ గట్టు ప్రాంత వాసులు ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఎంతో సహకరించిందన్నారు. దక్షిణ గట్టు వాసులు చిల్లా పుష్ప, తదితరులు మాట్లాడుతూ.. కోలగట్ల నాయకత్వంలో వైఎస్సార్‌సీపీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డోల మన్మథకుమార్, చిట్టెళ్ల రాంబాబు, మధుసూదనరావు, ఆడారి నగేష్, మూర్తి, శేషు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పీవీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- మాన్సాస్ విద్యాసంస్థల చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు



మాట్లాడుతున్న మాన్సాస్ విద్యాసంస్థల చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు

విజయనగరం టౌన్: విద్యల నగరమైన విజయనగరంలో విద్యాభివృద్ధికి కృషిచేసిన మహనీయుడు డాక్టర్ పీవీజీ రాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మాన్సాస్ విద్యా సంస్థల చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. స్థానిక కోటలో ఉన్న ఓపెన్ ఆడిటోరియంలో పీవీజీ వందేళ్ల జయంతి వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీవీజీ కృషికి అర్థాన్నిచ్చేలా పని చేయాలన్నారు. ఇప్పటివరకు చేసిన తప్పులను పక్కనపెట్టి అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సునీలా గజపతిరాజు, విద్యావతీదేవీ, అదితి గజపతి, కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్.రాజు, డాక్టర్ ఏవీడీ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జోనల్ కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్‌సీపీ జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని మొకర అప్పారావు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జోనల్ కార్యాలయాన్ని డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం రాత్రి ప్రారంభించారు. కార్పొరేషన్ పరిధిలోని 17, 18, 19, 20, 21 డివిజన్‌లతో పాటు 50వ డివిజన్‌లోని కొంత భాగానికి సంబంధించి పార్టీ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం వెనుక జోనల్ వ్యవస్థ పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే తాజా ఎన్నికల్లో గెలుపు కోసం జోనల్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో జోనల్ కార్యాలయాలు ప్రారంభించామన్నారు. ఆరు డివిజన్‌లను ఒక జోన్‌గా ఏర్పాటు చేసి ఎన్నికల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆయా డివిజన్ల పరిధిలో ఏ ఒక్కరికైనా ఎటువంటి సహాయ, సహకారాలు కావాలన్నా జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ లెంక వరలక్ష్మి, 21వ డివిజన్ కార్పొరేటర్ కనకల నాగవల్లి, యువజన నాయకుడు లెంక నరేష్, కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌ఎం కె. సూర్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 79891 68622 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గడ్డి వాములు దగ్ధం

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. రైతులు గంటా వీరప్ప, కొర్రాయి సూర్యనారాయణకు చెందిన గడ్డివాములకు తొలుత మంటలు వ్యాపించాయి. స్థానికులు గజపతినగరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. పక్కనే గల మిగతా గడ్డి వాములకు మంటలు వ్యాపించకుండా చేశారు. రైతులకు సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి ఎం.ఎస్.వి.రవి ప్రసాద్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి, మద్రివలస గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించేలా దృష్టి సారించాలని ఆర్‌ఓ సూర్యకళకు సూచించారు. ఓటర్లకు అందుబాటులో తాగునీరు, వైద్యసదుపాయంతో పాటు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.ఆయన వెంట తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.